క్లుప్తంగా

వీరభద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ సత్యవతి పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని అభిషేకం చేయించారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యుల పేర్లపై గోత్రనామార్చనలు చేశారు. అర్చకులు ఆమెను కండువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఐలి నరహరి, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూ నాయక్, కల్లెపు శ్రీను, గుండెబోయిన సూరయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

తొర్రూరు రూరల్: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాలగిరి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించారు. ఈసందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రధానంగా సీసీ రోడ్లు, సైడ్ కాల్వలు, తాగునీరు, కరెంట్ సరఫరాలో నిరంతరం అంతరాయం వంటి సమస్యలు ఉన్నాయని, వెంటనే ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝూన్సీరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్, అంజయ్య, మహేందర్, శ్రీనివాస్‌రావు, యాకయ్య, అశోక్ పాల్గొన్నారు.

నేడు కురవికి 'కూనంనేని' రాక

కురవి/నెహ్రూసెంటర్: మండల కేంద్రంలో నేడు(గురువారం) సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఈశ్వరసాయి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈసమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

'కులగణనకు ఉన్నతస్థాయి సమావేశం శుభపరిణామం'

మరిపెడ రూరల్: కుల గణనకు తక్షణమే డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచాలని గోపా మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈసందర్భంగా బుధవారం మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కుల గణనకు విధానాల రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టడానికి ఒకటి, రెండు నెలల్లో మొత్తం కుల గణంకాలు సేకరించడానికి అవకాశం ఉందన్నారు. ఇప్పటికి తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టడానికి అధునాతన సాంకేతిక విధానం అందుబాటులో ఉందన్నారు. 13కోట్ల జనాభా గల బిహార్‌లో కులగణన కేవలం మూడు నెలల సమయం పట్టిందన్నారు. మూడున్నర కోట్ల జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ సమయంలో చేపట్టడానికి చాలా అవకాశం ఉందని తెలిపారు.

బస్టాండ్‌లో దిగబడిన బస్సు



కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు బురదలో దిగబడింది. బుధవారం సూర్యాపేట నుంచి మహబూబాబాద్ వెళ్లేందుకు వచ్చిన బస్సు బస్టాండ్‌లోకి వెళ్లింది. వర్షాలకు బస్టాండ్ ఆవరణ మొత్తం బురదమయంగా మారడంతో బస్సు బురదలో కూరుకుపోయింది. మూడు గంటల పాటు ప్రయాణికులు కష్టపడి బస్సును బయటకు లాగారు. బురద పోయే వరకు బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపై ఆపితే ఇలాంటి ఇబ్బందులు తప్పుతాయని ప్రయాణికులు చెబుతున్నారు.

యువతి అదృశ్యం

డోర్నకల్: మండలంలోని రాముతండాకు చెందిన ఓ యువతి దృశ్యమైంది. డోర్నకల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాముతండాకు చెందిన 18 ఏళ్ల యువతి ఈనెల 10న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. తండ్రితోపాటు కుటుంబ సభ్యులు వెతికినా యువతి ఆచూకీ దొరలేదు. తండ్రి భూక్యా రవి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



మహబూబాబాద్ రూరల్: వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు



కేసముద్రం: అమీనాపురంలో..



గూడూరులో లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



తొర్రూరు: పూజలో పాల్గొన్న భక్తులు



డోర్నకల్‌లో..



గార్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మహబూబాబాద్ రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి దేవాలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గూడూరు: హిందూ సంస్కృతిలో విశేష స్థానం కల్గిన తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటిలో దీపాలు వెలిగించి కులదైవాలకు పూజలు చేశారు. అనంతరం స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి, సనాతన శివాలయంలో పూజలు చేశారు.

డోర్నకల్: మండలంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. డోర్నకల్, అమ్మపాలెంతోపాటు పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని మురళీకృష్ణ మందిరంలో తొలి ఏకాదశి పండుగ వేడుకలను పురస్కరించుకొని సుందర్ సత్సంగ్ సంఘం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు అనుమాండ్ల మోహన్‌రెడ్డి, మాశెట్టి రమేష్, కూరపాటి వెంకటేశ్వర్లు, మాశెట్టి జమున పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో కుటుంబ సమేతంగా స్వామివారికి, అమ్మవారికి పూలు, పండ్లను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గార్ల: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని గార్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ నామ భజన మండలి బృందం భక్తులు 108 పర్యాయాలు విష్ణు సహస్రనామం పరాయణం పఠించారు. అనంతరం స్వామివారికి అర్చకులు అచ్చుత్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు జక్కుల పాండురంగారావు, రమేష్‌బాబు, రాంబాబు, కుటుంబరావు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివాలయంలో, లక్ష్మీనర్సింహస్వామి, తిరుపతమ్మ తల్లి ఆలయంలో తొలి ఏకాదశి పూరస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బీరన్న బోనాలు



మహబూబాబాద్ రూరల్: జమాండ్లపల్లి గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

మహబూబాబాద్ రూరల్: కురుమ కులస్థుల కుల దైవం బీరప్ప బోనాల వేడుకలు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఏర మహేష్ ఆధ్వర్యంలో బోనాలను తయారుచేసి ఊరేగింపుగా బ్యాండు వాయిద్యాలతో కుటుంబ సమేతంగా బీరప్పకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో ఊరంతా సందడి నెలకొంది.

గూడూరు: మండల కేంద్రంలోని గొల్లగూడెంలో బుధవారం బీరన్న బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం తొలి ఏకాదశి పర్వదినాన కురుమ కులస్థుల ఇలవేల్పు అయిన బీరన్న, కామరాతి అక్క మహంకాళి దేవతామూర్తులకు బోనాలు సమర్పిస్తారు. ఈ క్రమంలో ప్రతీ ఇంటి నుంచి తయారు చేసిన బోనం ఎత్తుకొని మహిళలు వస్తుండగా, పెద్దలు డప్పు చప్పుళ్లతో కళాకారుల నృత్యాలతో సమీప బీరన్న దేవాలయం చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కుల పెద్దలు మండల కొమురయ్య, మంగ చేరాలు, ఉపేందర్, కుండె కిషన్, కోరె పాపయ్య, మండల మల్లేష్, కుమారస్వామి, దూడె ఐలయ్య, మంగ బీరయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.



గూడూరు: బోనాలతో వెళ్తున్న మహిళలు

'ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదు'

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పథకాలను హేళన చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌కు బుధవారం ఫిర్యాదు చేసి మాట్లాడారు. రైతు రుణమాఫీతోపాటు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నారని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు అధికారం కోల్పోయిన కడుపుమంటతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. పదేళ్లలో ఒక్కరేషన్ కార్డు, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా పరీక్షలు సైతం సక్రమంగా నిర్వహించలేదన్నారు. పార్టీ నేతలకు ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ రాములునాయక్, నారాయణ్ సింగ్, గంధ్రాతి మల్లేష్, గుంజె హన్మంతు, బొల్లు రాజు, రాము, కొండి సాయికిరణ్, రామరాజు ఉపేందర్, ప్రవీణ్, రావిశెట్టి చంద్రశేఖర్, పాల్గొన్నారు.



టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న శంతన్ రామరాజు, తదితరులు

కనీస వేతన చట్టాన్ని సవరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

బయ్యారం: పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం బయ్యారంలో వ్యవసాయ కూలిరేట్లు పెంచాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని ప్రతీ 2 సంవత్సరాలకోసారి సవరించాలని డిమాండ్ చేశారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఆస్పత్రి ఫీజులు మందులు, సెల్‌ఫోన్, కేబుల్ టీవీ రీచార్జీలు పెరిగినందున వ్యవసాయ కార్మికుల కూలిరేట్లు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా లేబర్ ఆఫీసర్ గ్రామాల్లో చాటింపు చేసి కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య, మోహన్, మారయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కేసముద్రం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు సత్తా చాటాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథి అన్నారు. బుధవారం మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో పార్టీ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పాలన సాగిస్తుందన్నారు. ప్రజాసమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెరుగు కుమార్, ఉపేందర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్, బోనగిరి హైమావతి, కొమురయ్య, సోమయ్య, గురువయ్య, ఇమామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథి

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



బారికేడ్లు చూపుతున్న సీఐ, ఎస్సై

గూడూరు: ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని సీఐ కె.బాబూరావు అన్నారు. మండల కేంద్రంలోని గూడూరు నుంచి మహబూబాబాద్, నర్సంపేట వైపు వెళ్లే 365 జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు ప్రమాదాల నివారణలో భాగంగా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల గూడూరు ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో లారీ బోల్తాపడిన ప్రమాదంలో ఒక కానిస్టేబుల్, టీచరు మృతిచెందిన విషయాన్ని గుర్తు చేశారు. జాతీయ రహదారి కావడంలో లారీలు, ఇతర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతూ, ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. అలాంటి ప్రమాదాలు ఇకపై జరుగకుండా బారికేడ్లు పెట్టామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో పలువురు వ్యాపారస్తులు డ్రెయినేజీ కాల్వపై రేకుల షెడ్లు నిర్మించారని, కొందరు నేమ్ బోర్డులు పెట్టడంతో మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని తొలగించే క్రమంలో ముందుగా ఆయా షాపుల యజమానులకు నోటీసులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ నగేష్, కానిస్టేబుల్లు రవీందర్‌రెడ్డి, సౌభాగ్య, అమృత పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నర్సంపేట: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచే వరకు ఉద్యమం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ద్యాగల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికకు ముందు కామారెడ్డి సభలో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. ఈనెల 18న వరంగల్ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో సమగ్ర కుల గణన యాత్ర సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు వరంగల్ జిల్లాతో పాటు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ కులాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, రమేష్, భాస్కర్, రాజేందర్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



కురవి: హట్యాతండాలో పీరీలను ఎత్తుకున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ నెహ్రూనాయక్



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో..



మహబూబాబాద్ రూరల్: బేతోలులో..



దంతాలపల్లి: కుమ్మరికుంట్ల గ్రామంలో..



తొర్రూరు రూరల్: గుర్తూరులో..



డోర్నకల్‌లో..



కేసముద్రం: ఇనుగుర్తిలో..



గార్ల పట్టణంలో..

మొహర్రం పండుగలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ముస్లిం మతపెద్దలతో కలిసి వివిధ కూడళ్లల్లో డప్పు చప్పుళ్ల మధ్య పీరీల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సవార్లను నీటిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ.. ముస్లింల ప్రధాన పర్వదినాల్లో ఒకటైన మొహర్రం పండుగ ముఖ్యమైందన్నారు. పలువురి ముస్లిం వీరుల స్మారకార్థం త్యాగాలను పీరీల రూపంలో తయారు చేసి వాటికి తొమ్మిది రోజులు ప్రార్థనలు చేసి పదో రోజు అర్ధరాత్రి వరకు ఊరేగించి తెల్లవారు జామున సవార్లను నీటిలో నిమజ్జనం చేస్తారని తెలిపారు. - సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కిరీటాపురానికి చెందిన గొల్లబోయిన నవీన్‌కుమార్(36) ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈనెల 8న ఇంట్లోని రేకుల షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారకస్థితికి చేరుకున్న నవీన్‌కు ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా తండ్రి జానకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఘన నివాళి

తొర్రూరు రూరల్: బడుగు, బలహీనవర్గాలు, పీడిత ప్రజల కోసం నిత్యం పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేసిన పెరుమాండ్ల జగన్నాథం ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుర్తూరు గ్రామంలో జగన్నాథం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండి యాకుబ్, నాయకులు పెరుమాండ్ల తిలక్‌బాబు, గుద్దెటి సాయిమల్లు, ఉమ్మగాని యాకయ్య, మార్గ సాంబయ్య పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మండల కమిటీ ఎన్నిక

తొర్రూరు: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం డివిజన్ కార్యదర్శి గొడిశాల మనోజ్ తెలిపారు. మండల నూతన అధ్యక్షుడిగా గాదెగని జశ్వంత్, కార్యదర్శిగా ఉడుత వేణు, ఉపాధ్యక్షుడిగా విష్ణు, కోశాధికారిగా పాడిశెట్టి వినయ్, సహాయ కార్యదర్శులుగా చాగంటి ప్రదీప్, తండ అభిలాష్, కార్యవర్గ సభ్యులుగా అరుణ్, కుమార్, అశోక్, సిద్దు, సాగర్, వీనిల్, రాకేష్‌లు ఎన్నికయ్యారు.

రోడ్డుపైనే పార్కింగ్..!



డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్, కూరగాయల మార్కెట్, మెయిన్ రోడ్డులో రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్లతోపాటు ఇతర దుకాణాలను రోడ్ల ప్రక్కన ఏర్పాటు చేయడంతో వాహనాలను నిలిపేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కురుమలు ఐక్యంగా ఉండాలి



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గూడూరు: కురుమ కులస్థులు ఐక్యంగా ఉండాలని గ్రామశాఖ అధ్యక్షుడు కోరె అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని గొల్లగూడెంలో బుధవారం రాష్ట్ర కురుమ సంఘం పిలుపు మేరకు జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దలు మండల కొమురయ్య, చీర అశోక్, మండల ఉపేందర్, కోరె పాపయ్య, కుండె కిషన్, మండల వెంకటేశ్వర్లు, మంగ కొమురయ్య, దూడె మల్లయ్య, శ్రీనివాస్, బీరయ్య, కుమారస్వామి, రామచంద్రయ్య, మండల మల్లేష్, కోరె మల్లయ్య పాల్గొన్నారు.